రోజుకో రైతు బలి!

తెలంగాణలో అన్నదాతల మరణ మృదంగం

- కాంగ్రెస్ అధికారం చేపట్టి 408 రోజులు
- ఇప్పటివరకు 402 మంది ఆత్మహత్యలు
- రైతుల ఉసురుతీస్తున్న కాంగ్రెస్ పాలన
- ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యంతో సాగునీటికి కటకట
- అరకొర రుణమాఫీతో పెరిగిన బాధలు
- రైతుల ఆత్మహత్యలపై జాబితా విడుదల చేసిన బీఆర్ఎస్

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రోజుకో రైతు చొప్పున బలవుతున్నాడు. సాగునీటి సమస్యలు ఒకవైపు, అప్పులబాధలు తీరక మరోవైపు అవస్థలు పడుతున్న రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రైతుల కష్టాలకు రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ మరింత ఆజ్యం పోస్తున్నది. పెట్టుబడి సాయం ఇవ్వక, ఇస్తానన్న రుణమాఫీని అందరికీ అమలుచేయక పరోక్షంగా రైతుల మరణాలకు కారణమవుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు 402 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు బలవన్మరణాలకు పాల్పడిన రైతుల జాబితాను ఆదివారం తాజాగా విడుదల చేశారు. దీని ప్రకారం 2023 డిసెంబర్ 9 నుంచి ఈ ఏడాది జనవరి 19 వరకు 402 మంది అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అంటే 2023 డిసెంబర్ 7న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 408 రోజుల్లో సగటున రోజుకొక రైతు చొప్పున ఆత్మహత్య చేసుకున్నాడని బీఆర్ఎస్ వాస్తవాలను బహిర్గతం చేసింది.

సంబరాల సీజన్‌లో మరణాలు

బీఆర్ఎస్ విడుదల చేసిన గణాంకాలను విశ్లేషిస్తే.. అత్యధికంగా నిరుడు నవంబర్‌లో 48 మంది, డిసెంబర్‌లో 45 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. సాధారణంగా వానకాలం పంటకు దసరా తర్వాత కోతలు మొదలవుతాయి. నవంబర్, డిసెంబర్‌లో పంట రైతుల చేతికి వస్తుంది. ఈ సమయంలో గ్రామాల్లో సంతోషకరమైన వాతావరణం ఉంటుంది. వానకాలం పంటకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడం, పంట కొనుగోళ్లలో ఇబ్బందుల కారణంగా పెట్టుబడి కూడా రైతులకు మిగలలేదని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. అందుకే నిరుడు నవంబర్, డిసెంబర్‌లో అన్నదాతల ఆత్మహత్యలు ఎక్కువగా నమోదయ్యాయని విమర్శిస్తున్నారు.

14 నెలల్లో జరిగిన ఆత్మహత్యలు

నెల	మరణాల సంఖ్య
డిసెంబర్ (2023)	7
జనవరి (2024)	24
ఫిబ్రవరి	27
మార్చి	29
ఏప్రిల్	27
మే	25
జూన్	29
జూలై	34
ఆగస్టు	41
సెప్టెంబర్	26
అక్టోబర్	21
నవంబర్	48
డిసెంబర్	45
జనవరి (2025)	19
మొత్తం	402

ప్రభుత్వ దగాతో దిగాలుపడిన రైతులు

ఎన్నికలకు ముందు అరచేతిలో స్వర్గం చూపించి, అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించిందంటూ రైతులు ఏకంగా రోడ్డెక్కుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ రైతు డిక్లరేషన్‌లో రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల రైతు భరోసా, అన్నిరకాల పంటలకు రూ.500 బోనస్, కౌలు రైతులకు ఏటా రూ.12 వేలు, భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12 వేలు.. ఇలా అనేక హామీలను ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9న రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సహా నేతలంతా దేవుళ్లపై ఒట్లు వేసి మరీ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక రుణమాఫీని పక్కన పెట్టడంతో రైతులపై మొదటి పిడుగు పడింది. గద్దెనెక్కగానే యాసంగి పంటకు రైతు భరోసా అమలు చేస్తామని చెప్పి మొండిచేయి చూపడంతో పెట్టుబడి సాయం అందక రైతులు మరింత దిగాలు పడిపోయారు. ఫలితంగా రైతులపై అప్పులభారం పెరిగింది. ఎన్నికలకు ముందు రైతుబంధు వేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తే అడ్డుకొని, అధికారంలోకి వచ్చిన తర్వాత నెలలపాటు రైతులకు నగదు ఇవ్వకుండా కాలయాపన చేసింది. కాళేశ్వరాన్ని పక్కనబెట్టడం, ఇతర ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం కారణంగా చెరువుల్లో నీళ్లు లేక భూగర్భజలాలు అడుగంటాయి. ఫలితంగా సాగునీరు అందని దుస్థితి నెలకొన్నది. వానకాలం పంటకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడంతో అప్పుల భారం మరింత పెరిగిపోయింది. దీనికితోడు పంట కొనుగోళ్లలో జాప్యంతో రైతులను సర్కారు మరింత ఇబ్బంది పెట్టింది. ఫలితంగా రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరిగిపోయాయని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు.

ఆదిలాబాద్‌లోని ఓ బ్యాంకులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు దేవ్‌రావు(ఫైల్)

మెదక్‌లో అత్యధిక మరణాలు

బీఆర్ఎస్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. అత్యధిక రైతు ఆత్మహత్యలు మెదక్ జిల్లాలో నమోదయ్యాయి. ఆ జిల్లాలో ఏకంగా 62 మంది అన్నదాతలు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. ఆ తర్వాత ఆదిలాబాద్ 33, హనుమకొండ 26, మహబూబాబాద్ 25, వరంగల్ 24 మంది చొప్పున నమోదయ్యాయి. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెప్తున్నా.. తమ రుణంమాఫీ కాలేదు మహాప్రభో అంటూ వేలాది మంది రైతులు ఇప్పటికీ బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో అప్పులభారం పెరిగి, ఆవేదనతో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో ఓ రైతు ఏకంగా బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడటం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని బీఆర్ఎస్ విమర్శిస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి అన్నదాతల ఆత్మహత్యలకు గత కారణాలను విశ్లేషించి, నివారణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

అత్యధిక ఆత్మహత్యలు నమోదైన 10 జిల్లాలు

జిల్లా	మరణాల సంఖ్య
మెదక్	62
ఆదిలాబాద్	33
హనుమకొండ	26
మహబూబాబాద్	25
వరంగల్	24
జనగామ	17
నల్లగొండ	17
సిద్దిపేట	17
భూపాలపల్లి	13
కరీంనగర్	11

మరో రైతు ఆత్మహత్య

- ఆదిలాబాద్ జిల్లాలో దారుణం
- రెండు రోజుల్లోనే ఇద్దరి బలవన్మరణం
- బిగుబడులు లేక.. సర్కార్ సాయం రాక ప్రాణాలు వదులుతున్న అన్నదాతలు

ఆదిలాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో మరో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. బ్యాంకు అధికారుల వేధింపులు భరించ లేక శనివారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలం రేణిగూడకు చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు బ్యాంకులోనే ఆత్మహత్య చేసుకోగా.. ఆదివారం అదే జిల్లాలో కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సాగులో ఆశించిన మేర దిగుబడులు రాకపోవడం.. పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగకపోవడం.. పెట్టుబడి సాయం అందకపోవడం.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక రైతులు తనువు చాలిస్తున్నారు. వివరాలు ఇలా.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లింగోజీతండాకు చెందిన కౌలు రైతు రాథోడ్ గోకుల్ (40) పదేండ్లుగా పదెకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. పంటలు సరిగా పండకపోవడంతో నష్టపోయాడు. దీంతోపాటు ఇటీవల ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. దాదాపు రూ.10 లక్షల వరకు అప్పులు ఉన్నట్టు సమాచారం. అప్పులు పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన గోకుల్ ఈనెల 12న కౌలు చేస్తున్న వ్యవసాయ భూమిలో పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యులు వెంటనే ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు.

సర్కార్ నిర్లక్ష్యం వల్లే రైతుల ఆత్మహత్యలు: మాజీ మంత్రి జోగు రామన్న

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగానే ఆదిలాబాద్ జిల్లాలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన రిమ్స్‌కు వెళ్లి రైతు రాథోడ్ గోకుల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోకుల్ పది ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చిన మేరకు రైతు భరోసా, కౌలు రైతులకు ఆర్థిక సాయం అందించడంలో విఫలమైందని మండిపడ్డారు. ఈ క్రమంలోనే కౌలు రైతు గోకుల్ మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రిమ్స్ మార్చురీ వద్ద కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

మూసివేత దశలో నేరెడ్‌మెట్ డైట్?

- 65 ఏండ్ల చరిత్ర ఉన్న కాలేజీకి ఈ దుస్థితి
- ఫ్యాకల్టీ లేకే గుర్తింపు ఇవ్వలేదన్న ఎన్సీటీఈ

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): 65 ఏండ్లకు పైగా చరిత్ర గల నేరెడ్‌మెట్ ప్రభుత్వ డైట్ కాలేజీకి ఈ ఏడాది కూడా నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) గుర్తింపు దక్కలేదు. డీఎడ్ మూడో దశ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుండగా, ఇంతవరకు గుర్తింపు దక్కక సీట్లు భర్తీచేయలేని పరిస్థితి నెలకొన్నది. ఎంతో మంది టీచర్లను తయారుచేసి, ఎందరికో జీవితాన్ని ప్రసాదించిన ఈ కాలేజీ ఇప్పుడు కనీసం గుర్తింపును దక్కించుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. ఈ కాలేజీలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో మొత్తం 150 సీట్లు ఉన్నాయి. ఫస్టియర్‌లో 150, సెకండియర్‌లో 150 చొప్పున 300 సీట్లున్నాయి. ఇప్పటికే ఫస్టియర్‌లో ఒక్కరూ లేకపోగా, ఇప్పుడు సెకండియర్‌లోనూ ఒక్క విద్యార్థి లేకుండా కాలేజీ మొత్తం ఖాళీ అయ్యింది. కాలేజీ గుర్తింపు లేకపోవడంతో డీఎడ్, డీపీఎస్ఈ వంటి కోర్సుల్లో చేరాలనుకునే హైదరాబాద్ జిల్లా విద్యార్థులు ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ప్రైవేట్ కాలేజీల్లో వేలకు వేలు ఫీజులు చెల్లించి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిరుడు కూడా దక్కని గుర్తింపు

నిరుడు కూడా నేరెడ్‌మెట్ ప్రభుత్వ డైట్ కాలేజీకి ఎన్సీటీఈ గుర్తింపును ఇవ్వలేదు. ఫెర్ఫార్మెన్స్ అప్రైజల్ రిపోర్టు (పార్)ను సమర్పించకపోవడంతో గుర్తింపు దక్కలేదు. దీంతో ఫస్టియర్‌లో అడ్మిషన్లు తీసుకోనేలేదు. ఉన్న సెకండియర్ విద్యార్థులు 2023 ఆగస్టులో తమ కోర్సును పూర్తిచేశారు. దీంతో ఈ కాలేజీలో ఇప్పుడు ఒక్క విద్యార్థి కూడా లేకుండాపోతారు. ఈ ఏడాది పార్ రిపోర్టును సమర్పించినా, రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక ఈ విద్యా సంవత్సరం గుర్తింపును ఇవ్వలేదు. ఈ కాలేజీలో విద్యార్థులే కాదు.. రెగ్యులర్ లెక్చరర్లు ఒక్కరు కూడా లేరు. ఇంతకాలం ఒక్క ప్రిన్సిపాల్ మాత్రమే ఉండగా, ఆయన కూడా ఇటీవలే రిటైర్ అయ్యారు. దీంతో ఆ పోస్టు ఖాళీ ఏర్పడింది. ప్రస్తుతం 12 గెస్ట్ లెక్చరర్ పోస్టులను మంజూరుచేసి నెట్టుకొస్తున్నారు. భవనాలున్నా.. ఫ్యాకల్టీ లేక, ఎన్సీటీఈ గుర్తింపు నివ్వకపోవంతో ఈ కాలేజీ మూసివేత దశలో ఉన్నది. దశాబ్దాల నాటి ఈ కాలేజీని కాపాడేందుకు చర్యలు చేపట్టాలని మంత్రులు, అధికారుల చుట్టూ గెస్ట్ లెక్చరర్లు తిరుగుతున్నారు.

లోకం పోకడ

భోగారంలో రైతులతో సమావేశమై, కరెంటు బిల్లులపై అవగాహన కలిగిస్తున్న కీసర విద్యుత్తు ఏఈ మురళీకృష్ణ

భోగారం రైతులకు విద్యుత్తు పునరుద్ధరణ

నమస్తే ఎఫెక్ట్

కీసర, జనవరి 19 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం భోగారంలో కరెంటు బిల్లులు కట్టలేదనే కారణంతో రైతులకు విద్యుత్తు సరఫరా నిలిపివేయడంపై నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనంతో ఉన్నతాధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాలతో కీసర విద్యుత్ ఏఈ మురళీకృష్ణ ఆదివారం ఉదయం 6 గంటలకు భోగారంలోని అగ్రికల్చర్ ఫీడర్‌ను ఆన్‌చేసి, విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. ఆ తర్వాత భోగారంలో రైతులతో సమావేశమై పెండింగ్ బిల్లులపై అవగాహన కల్పించారు. భోగారంలోనే రూ.1.50 కోట్ల బకాయిలు ఉన్నాయని, డప్పు చాటింపు చేసిన తర్వాతనే సరఫరా నిలిపివేశామని చెప్పారు. రైతులు బిల్లుల రూపంలో సహకరిస్తే మరిన్ని సేవలందిస్తామని ఏఈ తెలిపారు.

మరో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- కిస్తీలు కట్టలేక, అప్పులబాధతో బలవన్మరణం
- ఖమ్మం జిల్లా ఇల్లెందులో విషాదం

సుమంత్ (ఫైల్)

ఇల్లెందు, జనవరి 19: ఉచిత బస్సు పథకం మరో ఉసురు తీసినట్లయింది. 15 ఏండ్లుగా కలలు గన్న ఓ యువకుడు ఏడాది క్రితమే ఫైనాన్స్‌లో కొత్త ఆటో కొన్నాడు. సరిగ్గా అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో రోడ్డున పడ్డ ఎందరో ఆటో డ్రైవర్లలో ఈ యువకుడు కూడా ఉన్నాడు. ఆటోను కొత్తగా కొనుగోలు చేసినప్పటికీ మహిళలెవరూ పెద్దగా ఆటో ఎక్కకపోవడం, ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.12 వేలు ఇవ్వకపోవడం, రోజువారీ ఆదాయం కూడా సరిగా రాకపోవడం, కిస్తీలు కట్టేంత కిరాయిలు లభించకపోవడం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన భద్రాద్రి జిల్లా ఇల్లెందులో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ఇల్లెందు పట్టణానికి చెందిన రెడ్డబోయిన సుమంత్ (36) 15 ఏండ్లుగా అద్దె ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఏడాది క్రితం ఫైనాన్స్‌లో కొత్త ఆటో కొన్నాడు. సరిగ్గా అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. కోటి ఆశలతో కొత్త ఆటో కొనుగోలు చేసిన సుమంత్‌కు కష్టాలు మొదలయ్యాయి. గిరాకీ లేకపోవడంతో కిస్తీలు కట్టేందుకు అప్పుడు చేసేవాడు.కుటుంబ పోషణకూ మరికొంత అప్పు చేశాడు. ఇలా మొత్తం రూ.6 లక్షల అప్పు అయ్యింది. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ అమలు కాలేదు. అప్పులు తీర్చే మార్గం లేక ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సుమంత్‌కు భార్య నాగమణి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కాంగ్రెస్‌ది దగాకోరు ప్రచారం

- రైతు దేవ్‌రావ్ బలవన్మరణం.. ఆయన కుటుంబంపై కాంగ్రెస్ అసత్యాలు
- రాహుల్.. కండ్లుంటే ఇటు చూడు!
- ప్రతిరైతుకు రుణమాఫీ చేశామనడం దారుణం
- 40% కూడా కాలేదనేందుకు దేవ్‌రావ్ మరణమే నిదర్శనం : కేటీఆర్

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): 'రాహుల్.. కండ్లుంటే చూడు. ఆదిలాబాద్ అన్నదాత బ్యాంకులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన దైన్యాన్ని చూడు' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలతో బలవన్మరణానికి పాల్పడిన దయనీయ దృశ్యాలను చూడాలని ఆదిలాబాద్‌లోని ఒక ప్రైవేట్ బ్యాంకు సీసీటీవీ పుటేజ్‌ను రాహుల్‌గాంధీకి ట్యాగ్ చేశారు. రాష్ట్రంలో మాట తప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ దుర్మార్గచర్యలు పరాకాష్టకు చేరాయనేందుకు జాదవ్ దేవ్‌రావ్ అకాల మరణమే సాక్ష్యమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ సర్కార్ పట్టపగలు చేసిన హత్యకు ఇదే నిదర్శనమని మండిపడ్డారు. తన ఆర్థిక ఇబ్బందులకు మరణమే శరణ్యమని 50 ఏండ్ల దేవ్‌రావ్ భావించటం విషాదకరమని, రైతు బలవన్మరణం, ఆయన కుటుంబంపై దగాకోరు కాంగ్రెస్ అసత్య ప్రచారాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బ్యాంకులో ఉన్న సీసీటీవీ పుటేజ్‌ను చూసి అయినా రాహుల్ కండ్లు తెరవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ అమలైందని గొప్పలు చెప్పుకోవటం దారుణమని, రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 40 శాతం కూడా రుణమాఫీ అమలు కాలేదని చెప్పేందుకు జాదవ్‌రావ్ మరణోదంతమే నిదర్శనమని, ఎకరానికి రూ.15 వేల రైతుభరోసా అందిస్తామని చెప్పి యూటర్న్ తీసుకోవటం వంటి సంక్షోభ నిర్ణయాలతో కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రంగాన్ని చీకట్లోకి నెట్టిందని మండిపడ్డారు.

ప్రజాపాలనలో నేలరాలుతున్న రైతులు

- ఏడాదిలో 402 మంది బలవన్మరణం
- ఇవన్నీ కాంగ్రెస్ సర్కారు హత్యలే
- అన్నం పెట్టే రైతుల ఉసురు తీస్తున్నరు?
- రేవంత్‌రెడ్డి సర్కారు మొద్దునిద్ర నటించడం దుర్మార్గం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్
- ఆత్మహత్యలు చేసుకోవద్దని రైతులకు విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రజాపాలనలో రైతుల మరణ మృదంగం మోగుతున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదిలాబాద్ జిల్లాలో బ్యాంకు వేధింపులకు గిరిజన రైతు జాదవ్ దేవ్‌రావు ఆత్మహత్య ఘటన నుంచి తేరుకోకముందే.. అదే జిల్లాలో రుణభారంతో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని ఆదివారం ఎక్స్ వేదికగా విచారం వ్యక్తంచేశారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని, వరుసగా చోటుచేసుకుంటున్న రైతుల ఆత్మహత్యలే ఇందుకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలోనే 402 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రైతుల పాలిట కాంగ్రెస్ పార్టీ శాపంగా మరిందని మండిపడ్డారు. ఎద్దు ఏడిచ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడలేదనే విషయాన్ని కాంగ్రెస్ పాలకులు పూర్తిగా మర్చిపోయినట్టున్నారని దుయ్యబట్టారు. రుణమాఫీ కాకపోవడంతో అన్నదాతలు కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ విసిగిపోతున్నారని, ఉన్న భూములను కుదువపెట్టుకొని అప్పులు తెస్తున్నారని వాపోయారు. రుణమాఫీ కాలేదని ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలిపిన రైతులను అక్రమంగా అరెస్ట్ చేసి, పోలీస్ యాక్ట్-30 పేరుతో జిల్లాలో నిరసనలు చేపట్టొద్దని ఆంక్షలు విధించి ప్రశ్నించే గొంతులను అణగదొక్కారని నిప్పులు చెరిగారు.

> రుణమాఫీ పూర్తిచేసినమని చెప్పకొంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి బ్యాంకుల వేధింపులతో రైతుల ఆత్మహత్యలు కనిపించడంలేదా? దేశానికి అన్నం పెట్టే అన్నదాతల ఉసురు ఎందుకు తీస్తున్నరు? రైతుల వరుస బలవన్మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే.. వీటికి ముఖ్యమంత్రే బాధ్యత వహించాలి. -హరీశ్‌రావు

కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీస్తూనే ఉంటం

'రుణమాఫీ అని మభ్యపెట్టి.. 500 బోనస్ అని మోసం చేసి.. పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ దురవస్థ ఏర్పడింది. రైతు సోదరులారా.. దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి. మరణం పరిష్కారం కాదు. మీకు అండగా బీఆర్ఎస్ ఉన్నది. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టినట్టుగా అందరికీ రుణమాఫీ, రైతుభరోసా, అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీలు అమలు చేసేదాకా ఈ సర్కార్‌ను నిలదీస్తూనే ఉంటం' అని హరీశ్ హెచ్చరించారు.

> దేశానికి వెన్నెముక అయిన రైతుల జీవితాలతో రేవంత్ సర్కారు చెలగాటమాడుతున్నది. ఏడాది పాలనలో 402 మంది రైతులు ప్రాణాలు తీసుకున్నరు. ఇంత జరుగుతున్నా రేవంత్ ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తుండటం దుర్మార్గం. పదేండ్ల పాలనలో వ్యవసాయాన్ని కేసీఆర్ లాభసాటిగా మారిస్తే, రేవంత్‌రెడ్డి సంక్షోభంలోకి నెట్టిండ్రు. -హరీశ్‌రావు

అవసరమైతే నీతిమంతుడు లేదంటే అవినీతిపరుడా?

- సత్యసంధుడిలా కనిపించిన కేజ్రీవాల్ ఉన్నపళంగా చెత్తనాయకుడైపోయాడా?
- కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిలువుటద్దం ఢిల్లీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు ఢిల్లీలో ఆ పార్టీ అనుసరిస్తున్న వైఖరే సజీవ సాక్ష్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తమకు అవసరమైనప్పుడు ఒకలా, అవసరం తీరాక మరోలా వ్యవహరించటం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవాచేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్ అధినేత కేజ్రీవాల్‌పై అనుసరిస్తున్న వైఖరిని, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇండియా కూటమిలో ఉన్న అదే కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ అనుసరించిన వైఖరిని పరిశీలిస్తే స్పష్టమవుతున్నదని విమర్శించారు. 'నిన్నటిదాకా సత్యసంధుడు, వివేకవంతుడు, నీతిమంతుడిలా కనిపించిన కేజ్రీవాల్.. ఉన్నపళంగా నేడు అవినీతిపరుడు, చెత్తనాయకుడిగా కనిపిస్తున్నాడా?' అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన హామీలు అమలు కోసం ఏడాదిగా తెలంగాణ రైతులు, వృద్ధులు, మహిళలు, నిరుద్యోగులు నిరీక్షిస్తున్నారని గుర్తుచేశారు. అవే తరహా హామీలను కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ ప్రజలకు ఇస్తున్నదని, ఈ క్రమంలో రాహుల్‌గాంధీ తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడి, వారి అనుభవాలను తెలుసుకొని ఢిల్లీ ప్రజలకు మాలివ్వాలని సూచించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని పెద్దధన్వాడలో ఆందోళన చేస్తున్న రైతులు

ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి

పెద్ద ధన్వాడలో రైతుల నిరసన

రాజోళి, జనవరి 19 : జోగులాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్దధన్వాడలో ఏర్పాటు చేయతలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆదివారం వారు పెద్ద ధన్వాడలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కొంతమంది వ్యక్తులు తమ నుంచి వ్యవసాయ కోసమని భూములు కొనుగోలు చేసి వాటిని కంపెనీకి కట్టబెడుతున్నారని మండిపడ్డారు. అప్పుడే తమకు నిజం చెప్పి ఉంటే ఆ భూములను అమ్మేబోళ్లం కాదని అన్నారు. వెంటనే ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

దామోదర్ ఎన్‌కౌంటర్‌పై సందేహాలు

- పోలీసుల నుంచి వెలువడని ప్రకటన
- మావోయిస్టుల ప్రకటన ఫేక్ అంటూ ప్రచారం
- మృతుల్లో చొక్కారావు మృతదేహం లేదని తేల్చిన కుటుంబ సభ్యులు

బతుకమ్మ

ములుగు, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : మావోయిస్టు పార్టీ అగ్రనేత, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే దామోదర్ (దాదా) అలియాస్ చొక్కారావు మృతిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం మావోయిస్టు పార్టీ సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగా పేరుతో దామోదర్ మృతి చెందినట్టు లేఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆయన మృతిపై పోలీసుల నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో ఆదివారం మావోయిస్టుల ప్రకటన బోగస్ అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. మూడ